# జహాంగీరు న్యాయరక్షణ

శ్రీమతి పులవర్తి కమలాదేవిగారు

ఢిల్లీనగరమున రామచంద్రజీ దేవాలయము క్రిక్కిరిసియుండెను. పౌరాణిక బ్రాహ్మణుడొక్కడు మిక్కిలి చక్కగ పురాణమును నుడువుచుండెను. శ్రోతలాతని నిపుణత్వమునకు పరవశులై వినుచుండిరి. అతడిట్లు చెప్పెను.

"జనమేజయునకు వ్యాసుడిట్లు చెప్పెను. రాజా! నీ తండ్రి ప్రాయోపవేశుడై గంగాతీరముననున్న తరి శుకయోగి పావనుల చరిత్రలను నాతనికెఱింగించినాడు. శుకయోగి మున్ను సూతుండు శౌనకాదిమునీంద్రులకీ యుపాఖ్యానము నెఱింగించియున్నవాడు. దానిని నేనిపుడు దేవరకు దెలిపెదను. సావధాన చిత్తుండవై వినుము.

"పూర్వకాలమున ప్రహ్లాదుని కొమరుండగు విరోచనుడును, పుడమిసుర కుల సంభూతుండగు సునశ్శేపుడు నొక్క గురుని కడ విద్య నభ్యశించిరి. రాజ పుత్రుడగు విరోచనుడు ధనమదాంధుడు; అధికార గర్వాంధుడు. రాజస గుణప్రధానుడు. సునశ్శేపుడు సాత్త్విక గుణప్రధానుడు; విద్యలయందు చతురుడు; వినయ భూషణుడు. వారు విద్యాభ్యాసము చేయుచున్న తరి మరియొక ముని ప్రవరుండు వారి యాశ్రమమునకేతెంచి వారు గఱచుచున్న విద్యలంగాంచి, యందొక ప్రశ్న నడుగ సునశ్శేపుడు తనకు దోచిన విధంబున, తాను గురులకడ నేర్చిన రీతిని, తన మనస్సునకు ప్రమాణమని తోచిన భంగిని యాలోచించి యా ప్రశ్నకు సమాధానమొసంగినాడు. అందుల కా ముని సంతసింప విరోచనుడు తన సహపాఠికి గలుగుచున్న గౌరవమునకు కటకటంబడి యీసున నా మునిపుంగవునకు వందనంబిడి, "అయ్యా! దాని యర్థమిది కాదు. దాని యర్థమును నేను జెప్పుచున్నాను. బాడబుడు వీని కేమి తెలియును? సర్వశాస్త్రములు క్షుణ్ణముగ నేర్చిన వాడను; వ్యాకర్ణమున పతంజలి నాకు బనికిరాడు. నాయంత నేను జెప్పుకొనరాదు కాని పద్యరచనముననో అలంకార శాస్త్రముననో, ఛందశ్శాస్త్రముననో దేనిలో నాతడు నాతో వాదించి గెలువగలడో రమ్మనుడు. దీని యర్థమిట్లుండవలెను. వీనికి దెలియకున్న దెలియదని జెప్పనొప్పనుగాని తనకు దెలిసిన యర్థమే సరియైనదని తమ బోటి పెద్దలడిగిన నుడువుట తగని పని" యని సునశ్శేపుని వైపు విషపు జూపుం బ్రసరింపుచు మౌనివర్యునితో బల్కిన సునశ్శేపుండు సహజశాంతుడయ్యు విరోచనుని అధికారగర్వమునకు ధన మదాంధతకు మిక్కిలి గినిసి యిట్టులనియె. "రాజులకు ధనమున్నను, మదమున్నను, బలమున్నను నుండుగాక. అంత మాత్రమున మా బోటి సహజశాంత స్వభావుల సాహిత్య చర్యల కడ్డము బడుట పాడిగాదు. నీవిపుడు జెప్పిన వాదన శాస్త్ర ప్రకారము దూష్యమైనది. ఇందుల కేమందువు!" యనిన, నా రాజకులాధముం డంతటనైన బుద్ధి తెచ్చుకొనక తాబట్టిన కుందేటికి మూడే కాళ్ళను చందమున వాదించి, ఎవరిది నిజమో నిర్ధారణ మొనరించుట కొక మధ్యవర్తి కడకు బోదమనియెను.

"అందులకా బ్రాహ్మణ బాలకుడుగూడ నంగీకరించెను. ఆ కాలమున సర్వశాస్త్రములు కూలంకషముగ నెఱింగి న్యాయమును నిర్ణయింపగల ప్రభు వొక్క ప్రహ్లాదుడే వారికి గనపడినాడు. విరోచనడు ప్రహ్లాదునికడ కరుగుదుమనినాడు. అందుల కాధరామర బాలకుడు సమ్మతించి, విరోచనుని జనకుడైనను న్యాయముపట్ల నాతడధర్మము నాచరింపడని నమ్మి యాతనికడ కరుగుటకు సమ్మతించెను.

"ఎవరి వాదన యోడిపోయిన వారి తల నుత్తరించుటకు వారు పణముగా నిర్ణయించుకొనిరి. ప్రహ్లాద పార్థివేంద్రుని చెంత వారు వారము దినములు వాదించిరి. విరోచన విప్ర బాలకు లొక్క గురుని కడనే విద్యాభ్యాస మొనరించినను, ఇరువురును సునిశిత బుద్ధిగల వారలేయైనను, విప్రబాలకుని వాదమే సరియైనదిగ నిర్ధారణయగు సూచనలు గాన్పింపజొచ్చినవి. ప్రహ్లాదుడు తీర్పునకు మరుదినము వాయిదా వైచినాడు. విరోచనుడు న్యాయపతి తన తండ్రియే యగు కతమున తన పక్షమే తీర్పు నొసంగి తన్ను మరణమునుండి రక్షించునని యువ్విళ్ళూరుచుండ తండ్రి యాతనికి కబురంపి "ధూర్త రాకుమారా! ఏల యీ లీల యీ బ్రాహ్మణబాలుని తో పందెము వైచితివి. రేపటి సభయందాతడే నీ కన్న మిన్నయని నేను తీర్పునొసంగ బోవుచున్నాను. దాన నీవు అసువుల వీడవలసి వచ్చును గదా?" యనిన "తండ్రీ! కండకావరమున నే నెదిరి బలంబు నెఱుంగక యతని యందు గల యీర్ష్యచే యిట్లు తలపడినాడను. నీవిప్పుడు పుత్రుడనగు నన్ను క్షమియించి, నాదే మిన్నయని తీర్పు నొసంగవేని, నేను నా శిరమును వధ్యశిలపై వీడవలసిన దుస్థితి వచ్చును. కనికరింపవే" యని వేడుకొనెను. అందులకు ప్రహ్లాదుడెంత మాత్రమును లొంగడయ్యెను.

# జహాంగీరు న్యాయరక్షణ

"అప్పుడావిరోచనుడు తల్లికడకును అమ్మమ్మకడకు నరిగి వారి పాదంబులపైబడి యెటులైన దన మానప్రాణంబుల గాపాడ వేడుకొనగా వారలు ప్రహ్లాదుని కడకరిగి విరోచనుడే శునశ్శేపుని కన్న మిన్న యని తీర్పునొసంగవలసినదని యనేక విధంబుల బ్రతిమిలాడినను, ప్రహ్లాదుడు తన ధర్మపథమునుండి తిరుగడయ్యెను. అప్పుడు మంత్రి జ్వాలాజిహ్వుడు అరుదెంచి "దేవా! ఏలిన వారికి మేము మనవి చేయదగిన వారము కానప్పటికిని చనువుబలిమిని నేనొనరించు విన్నపము నాలింపుడు. మాతృశ్రీమనుమని రాబోవు మరణము దలంచుకొని కంటికి మంటికి నేకధారగ నేడ్చుచున్నది. ఇక యువరాజుగారి మాత దుఃఖమునకు మితియు మేరయు లేదు గదా? ఈ రాజ్యమును పరిపాలింపవలసిన యీయువక రత్నమును తమ తీర్పు మూలమున కృతాంతనిశాంతమున కధిపతిగ జేసి రాజ్య లక్ష్మికి వైధవ్యము నాపాదింతురా? మన రాక్షస గురువు శుక్రాచార్యులవారు, ప్రాణమాన విత్తభంగమం దబద్ధము నాడవచ్చునని సెలవిచ్చియున్న వారు గదా? కావున తమరు యువరాజావారే శునశ్శేపుని కన్న మిన్న యని రేపు తీర్పు జెప్ప బ్రార్థించుచున్నాడను" యని బల్కిన మంత్రిని గాంచి "మంత్రివరేణ్యా! ఇది వరకు నీ సలహాలు ధర్మ సమ్మతమైనవగుట నే నెన్నడు తిరస్కరించియుండలేదు. న్యాయాన్యాయ విచక్షణపట్ల నేను రాకొమారుడనియు భూసురకుమారుడనియు విచక్షణ నొనరింతునా? ఏటి మాట? పుత్రుడు బోయిన బోనిమ్ము. న్యాయ మిరువైపుల వాడిగల కత్తి. దాని పనికే నడ్డురాను. వృద్ధుడనైన నేను మాత్రము పుత్రవియోగశోకమున బ్రతుకుదు ననుకొంటివా? అయినను న్యాయమునుండి నేను తొలగను" యని మంత్రిని బంపివైచెను.

మరునాడు కొలువుకూటంబున మంత్రి సామంత పౌర జనుల సమక్ష్యంబున విరోచన యువరాజుకన్న వైదుష్యమున శునశ్శేపుడే పెద్దయనియు, వారలు మొదట పణముగనుంచుకొనిన రీతిగ యువరాజు శిరము వధ్యశిలపై నరుకబడవలయుననియు, ధనమదాంధత చేత కన్నుమిన్ను గానక యత్యంతాపచార మొనర్చిన యీ కవికుల తిలకుని పాదంబులపైబడి యువరాజు క్షమాపణను బహిరంగముగ జెప్పుకొనవలయుననియు ప్రహ్లాదభూపతి తీర్పునొసంగెను. ప్రజలెల్లరు హాహారావముల నొనర్చిరి. దేవతలు దివ్య విమానారూఢులై యిట్టి తీర్పునొసంగిన యీ ప్రహ్లాదునిపై పుష్పవర్షము గురిపించిరి. ఎదిరి వైదుష్యము కీర్ష్యపడి వారిని నిందించినందులకు యువరాజు సిగ్గుపడి, యీ బ్రాహ్మణ బాలకునకు నమస్కరించి "కవికులతిలకా! ఈర్ష్యాంధుడనై నీ మనస్సునకు నొప్పి గలిగింపదలచి యిట్టి పన్నాగము బన్నిన నా తప్పుసైరింపుము. నే నిదే సిద్ధముగనున్నాడను. వధ్యశిలకడ కరుదెంచెదను. నా శిరంబును గైకొనుము." యని వేడుకొనెను.

"సత్వగుణ ప్రధానులగు యుత్తముల మనంబులు నవనీతముకన్న మెత్తనైనవి. రాజుల మనంబులు వజ్రముకన్న కఠినతరంబులు. అప్పుడు శునశ్శేపుడు తన పాదంబుల వ్రాలిన యువరాజును లేవనెత్తి "మిత్రమా! నీకు జ్ఞానము గలుగ వలయునని యట్టి పణమును బెట్టితిని గాని నీ మృతివలన నాకు లభించున దేమి? ఇక నెన్నడు నీ కన్న మిన్నయగు వారిని తృణీకరించి యపయశంబు నొందవలదు. ప్రపంచమున వైదుష్యమునకు మితము మేరయునున్నదా? మన కన్న నెక్కువ దెలసినవాడు లేడని ఏల విఱ్ఱవీగెదవు! విద్య అనంతమైనది. ఎందరో పండితులు నివురుగప్పిన నిప్పు విధంబునందురు. వారలను సన్మానింప వలయునుగాని యవమానించిన నీ కందువలనకలుగు ఘనతగాని వారికందువలన ఘటించు న్యూనతగాని యావంతయులేదు సుమా? అనవసరముగ వారినవమానించి యాగామి దెచ్చుకొనకుము" అని మందలించి తన దారింజనియెను. ప్రజలెల్లరు బ్రాహ్మణార్భకుని మెచ్చుకొనిరి."

నాటికి పురాణ మాఖరైనందున నెల్లరు వెడలిపోవుచుండిరి. వారిలో మూలగ గూరుచుండి తలపై నాచ్ఛాదనము ధరించిన యొక వ్యక్తి వెడలిపోవుచు "హిందూపురాణముల యందెట్టి యమూల్యములగు విషయములున్నవి" యని యగ్గించుచు జనియెను. అతడు ప్రచ్ఛన్న వేషధారియగు జహాంగీరు సార్వభౌముడు. నాడు మొదలతడు తన కోట ద్వారమున నొక ఘంటనుంచి, న్యాయము కోఱకై వచ్చు వారలెల్ల దానిని వాయింపవచ్చునని సెలవొసంగెను. అతడట్లే నాడు మొదలు యెల్లరకు చిన్న పెద్ద తారతమ్యము లేకుండగ యుచిత రీతిని న్యాయ మొసంగుచు చాల కాలము రాజ్యమేలెను.

★